క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొమ్మాది: కార్తీకమాసం, శ్రీవారికి ప్రీతికరమైన శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చారు. ఉదయం తోమాల సేవ, సుప్రభాత సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. సాయంత్రం అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వీధిలైట్ల ఏర్పాటు



కొండపేట రహదారిలో పబ్లిక్ టాయిలెట్ల వద్ద ఏర్పాటు చేస్తున్న వీధిలైటు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేట రహదారిలో పబ్లిక్ టాయిలెట్ల వద్ద శనివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు వీధి దీపాలు లేకపోవడంతో చీకటిపడిన తర్వాత ఇక్కడి ఖాళీ ప్రదేశాలను బయటి వ్యక్తులు బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేశారు.

సీఎస్సీ అకాడమీతో ఒప్పందం



ఒప్పంద పత్రాలతో సంస్థల ప్రతినిధులు

తగరపువలస: భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఎస్సీ అకాడమీతో చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రీసెర్చ్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ స్కిల్స్ నైపుణ్యంపై శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ, నూతన సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులపై అవగాహన కోసం ఈ ఎంవోయూ ఉపయోగపడుతుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, సీఎస్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

సిస్టర్ ఆలిస్ మేరీ అస్తమయం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆలిస్ మేరీ(86) శనివారం తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ నుంచి భారతదేశం వచ్చిన ఆమె, విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. అనంతరం ప్రధానాచార్యులుగా, కరస్పాండెంట్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ చర్చ్‌లో సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని సిస్టర్ షైజీ తెలిపారు.

రైతుల మేలు కోసమే 'ధ్రువీకరణ పత్రం'



బోని గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆనందపురం : రైతులను అన్ని రకాలుగా ఆదుకోవడంతోపాటు, దేశంలోనే మేలైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తమ యాజమాన్య పద్ధతుల ధ్రువీకరణ పత్రం పథకాన్ని అమలు చేస్తోందని ఎక్స్‌టెర్నల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి చెప్పారు. మండలంలోని బోని గ్రామంలో సాగుచేసిన వరి పొలాల్లో శనివారం ఆయనతోపాటు వ్యవసాయాధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ పథకం దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉత్పత్తుల నాణ్యత పెంపుదల, వ్యవసాయ కూలీల ఆరోగ్యం, వారి భద్రత, ఆర్థికంగా నిర్ణయాత్మక శక్తిని పెంపొందించడం, తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక గిట్టుబాటు ధర కల్పించడం పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా ఉత్పత్తిదారుల కంపెనీలతో ఒప్పందం చేసుకున్న 15 మంది ఉద్యానవన ఫల రైతుల పొలాల్లోకి వెళ్లి రైతుల సమక్షంలో ధాన్యం నమూనాలు సేకరించారు. ఇలా సేకరించిన నమూనాల ధాన్యంలో పురుగు మందులు, ఎరువుల అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవడానికి బెంగళూరులోని పరీక్షా కేంద్రానికి పంపించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు. ధ్రువీకరణ పత్రం ఆధారంగా రైతులు పండించిన ధాన్యాన్ని రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా మిల్లింగ్ చేసుకొని వచ్చిన బియ్యాన్ని మార్కెట్లో అమ్ముకోవడమే కాకుండా విదేశాలకు ఏగుమతి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో భీమిలి డివిజన్ సహాయ సంచాలకుడు బి.విజయ్ ప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఏవోలు సంధ్యారత్న ప్రభ, సింహాచలం, ఉద్యానవన ఫల సీఈవో ఎంవీఎస్ రాజు, ఏఈవో శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో ధాన్యం నమూనాల సేకరణ

పద్మనాభం: ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి పంట ధ్రువీకరణలో భాగంగా పాండ్రంగిలో వరి పంటను ఎక్స్‌టర్నల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి శనివారం సందర్శించారు. విశాఖ ఉద్యానవన ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఒప్పందం చేసుకున్న ఎనిమిది మంది రైతుల ధాన్యం నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమూనాల్లో పురుగు మందులు, ఎరువుల అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో పరీక్షించేందుకు బెంగళూరులోని ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఉద్యానవన ఫల సీఈవో ఎం.వి.ఎస్.రాజు, భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి.విజయప్రసాద్, ఎంవీఎస్‌చలం, ఏఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి



జెడ్సీ కనక మహాలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న కార్యదర్శులు

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఇళ్ల ప్రాజెక్టుకు సంబంధించి లబ్ధిదారుల జియో ట్యాగింగ్, ఐసీఐసీఐ బ్యాంకు అకౌంట్లు తెరిపించేందుకు హౌసింగ్ సిబ్బందితో సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జీవీఎంసీ జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి సూచించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ వెయ్యి బ్యాంక్ అకౌంట్లు పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు మాట్లాడుతూ తమ కంటే ముందు పనిచేసి, వేరే చోటకి వెళ్లిన వారి పని పెండింగ్‌లో ఉంటే తమకు మెమోలు ఇచ్చారని, తమ రెగ్యులర్ బాధ్యతలు కంటే అదనంగా బాధ్యతలు, ఇతర సచివాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని వాపోయారు. హౌసింగ్ సిబ్బంది కూడా సహకరించడం లేదని ఆరోపించారు. వీటిపై చర్చిస్తానని జెడ్సీ పేర్కొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతంతో రైతులకు మేలు



మధురవాడలో సహకార సంస్థ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సోమేశ్వరరావు తదితరులు

మధురవాడ: రైతుల అభ్యున్నతికి సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. నవంబర్ 14 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల్లో భాగంగా మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆవరణలో సహకార శాఖ విద్యా విభాగం అధికారి సీహెచ్ సోమేశ్వరరావు పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్, మధురవాడ పర్సన్ ఇన్‌చార్జి ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ సంఘ అభివృద్ధిలో సభ్యుల పాత్ర చాలా కీలకమన్నారు. అంతా కలిసి సంఘ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సహకార వారోత్సవాలు, జెండా విశిష్టత, సంస్థ నిబంధనలు వివరించారు. సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ సంఘం తరపున పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై సభ్యులు ఏకగ్రీవంగా వ్యతిరేకత తెలిపారని, ఆ ఆలోచనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.అప్పరాజు, జె.అప్పారావు, కె.రామారావు, ఎస్.సత్యనారాయణ, పి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు తాటితూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస: ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నిడుమానూరులో ఈ నెల 19 నుంచి జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్ - 14 నెట్‌బాల్ పోటీలకు భీమిలి మండలం తాటితూరు హైస్కూల్ విద్యార్థులు బాలుర విభాగంలో జి.జస్వంత్, పి.చందు, బాలికల విభాగంలో బి.శ్రావణి, బి.వైశాలి ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు ఇటీవల భీమిలిలోని సన్ స్కూల్‌లో జరిగినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నలుగురు విద్యార్థులను పాఠశాలలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, పాఠశాల కమిటీ చైర్మన్ సరగడ రవి, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.ఎస్.వి.ప్రసాదరావు, సునీత విజయకుమారి, కామేశ్వరి తదితరులు అభినందించారు.

'డయల్ యువర్ డీఎం' నేడు

మధురవాడ: ఏపీఎస్ఆర్టీసీ మధురవాడ డిపో పరిధిలో ఆదివారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మేనేజర్ టి.ఉమామల్లేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురవాడ డిపో పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రయాణికులు, ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని, సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకుంటామన్నారు. మాట్లాడాలనుకునే వారు 89782 00455, 73829 24185కు చేయాలని సూచించారు.

పాలిటెక్నిక్ విద్యార్థినుల ప్రతిభ



చెక్ అందుకుంటున్న విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు వెబ్‌సైట్ డిజైన్ పోటీల్లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ శనివారం తెలిపారు. కళాశాలలో డిప్లమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ చదువుతున్న విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఎ.కె.ఎస్.కీర్తి, దీప్తిమయి రూపొందించిన వెబ్‌సైట్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఇందుకుగాను వీరికి నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.50 వేల నగదు ప్రోత్సాహం అందించారని తెలిపారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు



గ్రంథాలయంలో పుస్తకాలతో విద్యార్థినులు

ఆనందపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆనందపురం శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు రాయడం, చిత్రలేఖనం, మ్యూజికల్ చెయిర్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల కొత్త, పాత కథల పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బీవీఎస్ అప్పారావు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పీఎం పాలెం సర్వే నంబరు 35లో గల ప్రభుత్వ భూమిని శనివారం భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ రమణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ భూమిలో కట్టెపుళ్లలతో ఏర్పాటు చేసిన తడకను సిబ్బంది తొలగించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని భాస్కరరెడ్డి చెప్పారు. తహసీల్దార్ రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు అందడంతో గతంలో ఇక్కడ ఉన్న షెడ్ తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇది కొద్ది రోజుల కిందట వాలిపోయి కిందకి పడిపోయిందని, దానిని సరిచేసి పాతించామని చెప్పారు. సదరు భూమి ప్రభుత్వ స్వాధీనంలోనే ఉందని పేర్కొన్నారు.

పక్షి జాతులను పరిరక్షించుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: ప్రకృతిలోని పశుపక్ష్యాదులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గ్రీన్ క్లైమేట్ టీం సంస్థ వ్యవస్థాపకులు జె.వి.రత్నం అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల ఎన్నో పక్షి జాతులు అంతరించిపోతున్నాయన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న వాటికి సరైన నీరు, ఆహారం దొరక్క చాలా కష్టాలు పడుతున్నాయని, వాటికి మన వంతు సాయం చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో పక్షులకు గూళ్లు ఏర్పాటు చేసి ఆహారం, నీరు అందివ్వాలని సూచించారు. ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ విద్యాలయంలోని విద్యార్థినులంతా పర్యావరణ పరిరక్షణతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా పక్షుల పరిరక్షణకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు.

ప్రస్తుత విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



వేడుకల్లో రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, తదితరులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి ఎన్ఎస్ ఆర్ఐటీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ తాము చదువుకునే కాలంలో వసతులు లేవని, ప్రస్తుతం మెరుగైన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సుందర పిచాయ్ వంటి వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూ అకడమిక్ ప్లానింగ్ అధిపతి కేసీబీ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ బలాలను తెలుసుకుని బలహీనతలను వదిలేయాలన్నారు. వినడం, చదవడం, సాధన చేయడం ద్వారా ఉద్యోగ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి ఎస్.ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ బి.పూర్ణ సత్యనారాయణ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ బ్యాక్‌లాగ్స్ లేకుండా విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కోరాడ సచివాలయం సందర్శన



కోరాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని కోరాడ సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శనివారం సందర్శించారు. హాజరు పట్టీలు, సెలవులు, తీర్మానం, మూమెంటు రిజిస్టర్లు, క్యాస్ బుక్కులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే సమాచార పోస్టర్లు తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల అర్హులు, అనర్హుల జాబితా తెలియజేసే సమాచార పోస్టర్లు ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు.

పొట్నూరులో పంట కోత ప్రయోగం



పొట్నూరులో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో శనివారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా మహిళా రైతు మీనా సాగు చేసిన వరి పంటలో పంట కోత ప్రయోగ రీజినల్ అధికారి మోహన్‌రావు శనివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. 33 బస్తాల దిగుబడి వచ్చినట్టు నిర్ధారించారు. ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి హేమ సుందర్ మాట్లాడుతూ వరి పంట వేసే ముందు నవధాన్యాలు వేసి దమ్ము చేయడం, విత్తన శుద్ధి చేసి నారు వేయడంతోపాటు ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు పిచికారి చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. మహిళా రైతు మీనా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వరి పంట గతంలో కంటే ఈ ఏడాది అధిక దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో గణేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న చినబాబు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు అన్నారు. జనజాతీయ గౌరవ దివస్ - గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో నాలుగో రోజు రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాతృభాష ఆధారిత బహుభాష విద్య (టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్), అభివృద్ధిపై పాడేరు, పార్వతీపురం ఏజెన్సీ మండలాల్లో గల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భవన్ సిబ్బంది డాక్టర్ నాగరాజు, టి.వెంకటేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ సమీపంలో గల వాడపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రాజా వేగేశ్న ఫౌండేషన్ సమకూర్చిన దుస్తులను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి శనివారం అందజేశారు. ఏటా విద్యార్థులకు సహాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్.త్రినాథ్, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

పీఆర్‌టీయూ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామ పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి విశేష హారతులు, దీపారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

23న ఏకాదశి ప్రత్యేక పూజలు

ఈ నెల 23వ తేదీన కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ఉంటాయన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం, చేపలుప్పాడ గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఒక్కో వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో లవరాజు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఈ నెల 21, 22న విద్యార్హత, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 23న దరఖాస్తుల పరిశీలన, 24న ఇంటర్వ్యూలు, 25న ఎంపిక నిర్వహించి 27న పోస్టింగ్ ఇవ్వనున్నామని తెలిపారు.

భారత్ గెలవాలని విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు

తగరపువలస: ఆదివారం జరగనున్న ప్రపంచ్ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలవాలని కోరుతూ రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ చేపట్టారు. 2023 ప్రపంచకప్‌ను భారత్ గెలిచి మరోమారు దేశకీర్తిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పాలని నినాదాలు చేశారు. అంబేడ్కర్ కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, వాండ్రాసి భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.